నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | జనవరి 26, 2025 | www.navatelangana.com



## ఐదుగురిపై దాడి చేసిన కుక్క

- కుక్కలను తరిమిన తండావాసులు

**నవతెలంగాణ-రామారెడ్డి**

కుక్క దాడిచేయడంతో ఐదుగురు గాయపడగా.. పశువులపై సైతం దాడి చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బట్టు తండాకు చెందిన రామావత్ కృష్ణవేణి, స్కూల్ తాండకు చెందిన పి రేణ, సంగీత, ఎస్ వినోద్ తోపాటు గేదెపై, మేకలపై కుక్క దాడి చేసి గాయపరచగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కుక్కను తండావాసులు తరమికొట్టారు. అధికారులు వెంటనే స్పందించి కుక్కల బెడద నుంచి తాండాలను కాపాడాలని గిరిజనులు కోరుతున్నారు.



కుక్క దాడిలో గాయపడ్డ యువకుడు

## భార్యతో గొడవపడి భర్త అదృశ్యం



**నవతెలంగాణ-నిజాంసాగర్**

భార్యతో గొడవపడి భర్త అదృశ్యమైన ఘటన మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.ఎస్ ఐ శివకుమార్ వివరాల ప్రకారం.. వడ్డేపల్లి గ్రామానికి చెందిన బిక్షపతి (37) శుక్రవారం సాయంత్రం అందాజా ఐదు గంటల సమయంలో ఆమె భార్య అయిన లింగేశ్వరితో గొడవపడ్డారు. అయితే అదే రోజు రాత్రి 8 గంటలకు బిక్షపతి ఇంట్లో ఏమి చెప్పకుండా వెళ్లిపోయారు. ఎప్పటిలాగే అతను తిరిగి ఇంటికి వస్తాడనుకోని వారి అమ్మ నాన్న భార్య ఇంటి వద్దనే ఉన్నారు. కానీ రాత్రి 9:30 అయిన బిక్షపతి ఇంటికి రాకపోయేసరికి చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికిన ఆచూకీ లభించలేదు. కానీ బిక్షపతి తీసుకెళ్లిన బైక్ వడ్డేపల్లి గ్రామ శివారులో గల పాపా హరేశ్వర కుంట వద్ద ఉందని కానీ బిక్షపతి ఆచూకీ మాత్రం లభించలేదని అతని తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.



మహాసభలకు వెళ్తూ నినాదాలు చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

# సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు తరలిన నాయకులు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలో భాగంగా సంగారెడ్డి పట్టణంలో జరిగే బహిరంగ సభకు జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున సంగారెడ్డికి శనివారం తరలి వెళ్లారు. జిల్లా కేంద్రం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు సంగారెడ్డికి బయలుదేరిన సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ బాబు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు బహిరంగ సభలో పాల్గొనడానికి వెళ్తున్నారని తెలిపారు. ఈ బహిరంగ సభలో ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై చర్చించి వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీ కార్యక్రమాలకు నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. తరలివెళ్లిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, జిల్లా నాయకులు విగ్నేష్, సురేష్, నగర నాయకులు నర్సయ్య, అనిత, అనసూయ మ్మ, సుజాత, ఈవిఎల్ నారాయణ, సతీష్, సూచిత తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నవీపేట్,బోధన్, ఆర్మూర్, వర్ని, తదితర ప్రాంతాల నుంచి బయలుదేరి వెళ్లారు.

## సబ్‌జైలును సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

**నవతెలంగాణ-కామారెడ్డి**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టీ నాగరాణి కామారెడ్డి ఉప కారాగారాన్ని శనివారం సందర్శించారు. ఖైదీలను వారికి కల్పిస్తున్న సౌకర్యాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు వాళ్ళ హక్కులు, చట్టాలు వివరించారు. ఈ కార్యక్రమం లో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీనివాస్ రావు, సబ్ జైలు సూపరింటెండెంట్ సంజీవ రెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది సాయిప్రణీత్ , సాయికృష్ణ పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న టి.నాగరాణి

# సంక్షేమ పథకాలకు శ్రీకారం

- నేటి నుంచి అట్టహాసంగా నాలుగు పథకాలు ప్రారంభం
- ప్రతి మండలంలోని ఒక గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం
- అధికారులకు దిశా నిర్దేశం చేసిన కలెక్టర్‌లు
- అంతకుముందు వీసీలో సూచనలిచ్చిన సీఎస్

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు నేటి(ఆదివారం) నుంచి శ్రీకారం చుట్టనుంది. ప్రభుత్వం ముందునుంచి చెబుతున్నట్టు జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం నుంచి ఈ నాలుగు పథకాలను ప్రారంభించనున్నారు. ఇందుకోసం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. కాగా ఈ కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాలని జాగ్రత్తలపై సీఎస్ శాంతికుమారి శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్‌లు సైతం మండల అధికారులతో వీసీలో సూచనలు, సలహాలు ఇచ్చారు.

నాలుగు పథకాల అమలుకు ఆదివారం నుంచి శ్రీకారం చుట్టనున్నట్టు నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ప్రతిష్టాత్మక నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు. అనంతరం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి మండలంలో ప్రజాప్రతినిధుల ను సంప్రదించి వారి సూచన మేరకు ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన ప్రతీ గ్రామంలోనూ పథకాల ప్రారంభోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎలాంటి తప్పిదాలు, గందరగోళానికి తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేదిక, షామియానా, తాగునీరు వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లను చేయా లన్నారు. ప్రజా ప్రతినిధులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించాలని, మధ్యాహ్నం ఒంటి గంటకు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టాలన్నారు. ఎంపిక చేసిన గ్రామంలోనే నాలుగు పథకాల అమలును ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు.



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు..



కామారెడ్డిలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

ముందుగా ముఖ్యమంత్రి సందేశంతో కూడిన వీడియోను ప్రదర్శించాలన్నారు. ఒక్కో పథకానికి గాను ప్రత్యేకంగా ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆహార భద్రత కార్డులకు తహసీల్దార్ నేతృత్వంలో, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపీడీఓ ఆధ్వర్యంలో, రైతు భరోసాకు మండల వ్యవసాయ అధికారి నేతృత్వంలో, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి గాను ఏ.పీ.ఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు ఓవరాల్ ఇంచార్జీలుగా వ్యవహరిస్తూ నాలుగు సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

గ్రామాలకు వెళ్ళడానికి ముందే ఆయా పథకాలకు సంబంధించిన లబ్దిదారుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జాబితాలో నూటికి నూరు శాతం అర్హులు మాత్రమే ఉండేలా సరి చూసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనర్హులు ఉండకూడదని అన్నారు. ప్రజాపాలన గ్రామ సభల సందర్భంగా వచ్చిన దరఖాస్తులను సైతం పరిశీలించి, ఆయా పథకాల కింద అర్హుల పేర్లను జాబితాలో చేర్చాలని, పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలోనే వారికి కూడా పథకాల మంజూరీకి సంబంధించిన ప్రొసీడింగ్స్ అందించాలని కలెక్టర్ సూచించారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా తప్పనిసరి లబ్ధి చేకూరేలా చొరవ చూపాలని అన్నారు. అదే సమయంలో అనర్హులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి విమర్శలు, ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలో 535 గ్రామ సభలు, 80 వార్డు సభలు నిర్వహించామని, రేషన్ కార్డుల కోసం 54,534 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కొరకు 28,653 , రైతు భరోసా కోసం 2,653, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 18,098 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జడ్పీ సీఈవో చందర్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగింది

- మేయర్ దండు నీతూ కిరణ్



మేయర్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న మాజీ, తాజా ఎమ్మెల్యేలు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

నగర ప్రజలకు సేవ చేసే భాగ్యం తనకు కలిగిందని నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో 5 సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్ కార్పొరేటర్లకు శనివారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ 5 సంవత్సరాల కాలంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు సేవ చేసే అవకాశం రావటం చాలా ఆనందంగా ఉందని, ఈ అవకాశాన్ని కల్పించిన మాజీ నగర ఎమ్మెల్యే గణేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రభుత్వం ద్వారా ప్రజలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించే క్రమంలో రాత్రినక పగలనక కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా అండగా నిలిచిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు కార్మికులకు, శ్రేయోభిలా షులకు ధన్యవాదములు తెలిపారు. నేను పాల్గొన్న ప్రతి ఒక్క అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సాక్షిగా నిలిచి ప్రజల్లోకి తీసుకు వెళ్లిన మీడియా మిత్రులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే ధన్ పాలు సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త, డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబెర్స్, కమిషనర్ దీలిప్ కుమార్ , ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల్లో ఉంటే అధికారంలో ఉన్నట్టే

- ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకోండి
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- మున్సిపల్‌లో ప్రజాప్రతినిధుల పదవీ విమరణ మహోత్సవం

**నవతెలంగాణ-కామారెడ్డి**

ప్రజల్లో ఉంటే రాజకీయ నాయకులు అధికారంలో ఉన్నట్టే నని, ప్రజల సమస్యలను తీర్చడానికి అధికారంలో ఉండవలసిన అవసరం లేదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్ ర్సన్, మున్సిపల్ కౌన్సిలర్ల పదవి విరమణ మహోత్సవం శనివారం కామారెడ్డి జిల్లా కేంద్ర సమీపంలోని పర్టిక ప్యాలెస్‌లో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్ పదవి విరమణ కార్యక్రమానికి షబ్బీర్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత తొమ్మిది నెలల కాలంలోనే గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి చైర్పర్సన్‌గా ఉండి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి కామారెడ్డిని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లారన్నారు. పదవి ముగిసిన తర్వాత ప్రజల కోసం ప్రతి విషయాన్ని మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ డిఈ, టిపిఓ తదితర అధికారులతో పాలుపంచుకొని ప్రజల సమస్యలను తీర్చడానికి ముందు ఉండాలన్నారు. గత 10 ఏళ్ల కాలంలో కామారెడ్డి చాలా వెనుకబడిపోయిందని దానిని మనమంతా కలిసి ముందుకు తీసుకెళ్లవలసిన అవసరం ఉందన్నారు. కామారెడ్డికి అన్ని విధాల అభివృద్ధి జరుగుతుంటే ఓ వ్యక్తి కాంప్లెట్స్ చేయడం ద్వారా సిసి రోడ్ల బిల్లులు, బోర్ల బిల్లులు ఆగిపోయాయని ప్రస్తుతం బోరు వేయాలంటే ఇబ్బందికరంగా ఉందన్నారు. ప్రస్తుత ఈ తరుణం లో రాజకీయాలు మాట్లాడం సరికాదని తర్వాత మాట్లాడుకుందాం అన్నారు.



షబ్బీర్‌అలీకి జ్ఞాపిక అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సెలర్‌లు

అంతకుముందు మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తాము కామారెడ్డిని అభివృద్ధి చేస్తామని నమ్మి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఈ అవకాశాన్ని తమకు ఇచ్చారని, ఈ తొమ్మిది నెలల కాలంలోనే కౌన్సిలర్ల సహకారంతో కామారెడ్డిని ఐదు సంవత్సరాలలో చేసే అభివృద్ధిని 9 నెలల్లోనే చేసినట్టు తెలిపారు. కామారెడ్డి ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తమకు మరొకసారి అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా షబ్బీర్ అలీని కోరారు.

**పది రోజులు కూడా ఉంటా అనుకోలేదు :**

**కమిషనర్ స్పందన**

అనంతరం మున్సిపల్ కమిషనర్ చందన మాట్లాడుతూ తాను కామారెడ్డికి వచ్చే ముందు ప్రతి ఒక్కరు కామారెడ్డి లో ఎలా ఉంటావు ఎలా నెగులుతావు అని అన్నారని తాను పదిరోజులు కూడా ఇక్కడ డ్యూటీ చేస్తానని అనుకోలేదని ఇక్కడికి వచ్చాక కౌన్సిలర్ల సహకారంతో వారు చెప్పింది తాను వింటూ తాను చెప్పింది వారు వింటూ ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ఉరుదండ వనిత రవి, కో ఆప్షన్ సభ్యులు అన్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కామారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి రజా గౌడ్, వార్డ్ కౌన్సిలర్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిప్పిరి సుష్మా వెంకటి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మీర్జా ఆఫీస్ బేగ్, కౌన్సిలర్ పంపరు లతా శ్రీనివాస్, పోలీస్ కృష్ణాజి రావు, పాత శివ కృష్ణమూర్తి, అంజద్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పున్న రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిని స్మార్ట్ సిటీగా చేస్తా

- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు
- రూ.5 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎల్లారెడ్డిలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్**

ఎల్లారెడ్డి పట్టణాన్ని జిల్లాలో ఎక్కడలేని విధంగా స్మార్ట్ సిటీగా మలిచి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో 4,5,6,7,8, 12వ వార్డ్ లలో 5.15 కోట్ల టియుఎఫ్ఐడిఎస్ నిధులతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ డ్రైన్ పనులు శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎల్లారెడ్డి బస్ స్టాండ్ నిర్మాణ పనులు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మాట్లాడుతూ బస్టాండు, మినీ ట్యాంక్ బండ్, హైవే నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నాయని త్వరలోనే బస్టాండ్ కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ఏ పనికి కూడా నిధులు ఆగకుండా ఎల్లవేళలా కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ పనుల పురోగతిని తెలుసుకుంటున్నమన్నారు.

**ఎన్నో ఇళ్ల కల నెరవేరింది**

లింగంపేట మండల కేంద్రంలోని నేలమత్తడి కట్టు కాలువ ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు అన్నారు. శనివారం సాయంత్రం లింగంపేట మండల కేంద్రంలోని కట్టు కాలవ నిర్మాణం పనులను అదేవిధంగా సిసి రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. లింగంపేట్ రైతుల వరప్రదాయమైన కట్ట కాలువ పూర్తిగా మట్టితో కూడిక పోవడంతో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, 49 లక్షల నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. కాగా సంక్రాంతి పండుగ పురస్కరించుకొని నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు క్యాంప్ కార్యాలయంలో నగదు బహుమతి అందజేశారు. మొదటి బహుమతి హాజీపూర్‌తండా జట్టుకు రూ.51 వేలు, రెండో విజేత ఎల్లారెడ్డికి రూ.21 వేలు, మూడో జట్టు భిక్కనూర్‌కు రూ.11 వేలు నగదు బహుమతి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, లింగంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ రాజు,జిల్లా దిశ కమిటీ సభ్యులు రాజు దేశ్‌ముఖ్, వంజరి ఎల్లమ్మయ్య మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి, డాక్టర్ విట్టల్, అఫ్రోజ్, మాజీ ఎంపీపీ మోహిద్. రాష్ట్ర నాయకులు రఫీ యోద్దీన్, శ్రీనివాస్ రెడ్డి, రాజు, నగేష్, బాలయ్య, అశోక్, నాగరాజు లక్ష్మారెడ్డి, అల్లూరి, సిద్ధ రాములు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లింగంపేట్‌లో కట్టకాలువ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## రిపబ్లిక్ డే వేడుకకు ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్



ముస్తాబైన వేదిక

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నేడు నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఉదయం 9.00 గంటలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. రిపబ్లిక్ డే వేడుకకు ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు విచ్చేయనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులతో నిర్వహించిన సమీక్షలో సూచించారు. వేదిక, ఎగ్జిబిషన్ స్టాల్స్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్ల గురించి సంబంధిత శాఖల అధికారులతో ఐ.డీ. ఓ.సీలో సమావేశం నిర్వహించి కీలక సూచనలు చేశారు. ఈ మేరకు సంభందిత అధికారులు పోలీస్ పరేడ్ మైదానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థ పునాది

- ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరు గుర్తెరగాలి
- జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్ పిలుపు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థ పునాదిగా నిలుస్తోందని, దీనిని గుర్తెరిగి ప్రతి ఒక్కరు ఎంతో విలువైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవా లని సూచించారు. 15వ జాతీయ ఓటరు దినోత్స వాన్ని పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహిం చగా, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా ముఖ్య అతిథిగా విచ్చేశారు. వీడియో క్లిప్ ద్వారా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సందేశం వినిపించారు. తదుపరి ఓటర్లతో.. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించు కుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజ్యాంగం ద్వారా ప్రసాదించబడిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదిగా నిలుస్తోందని గుర్తు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా ఎన్నికలు జరిపిస్తోందని, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రతీసారి వినూత్న పద్ధతులను ప్రవేశపెడుతూ ప్రజలలో చైతన్యాన్ని పెంపొందిస్తుం దని అన్నారు.



ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు

ముఖ్య అతిథి వికాస్ మీనా, అదనపు కలెక్టర్ అంకిత్ లు మాట్లాడుతూ, స్వేచ్ఛాయుత వాతావరణంలో మనకు నచ్చిన నాయకులను ఓటు ద్వారా ఎన్నుకునే అవకాశం కేవలం ఓటు హక్కు ద్వారానే సాధ్యమని, నా ఒక్క ఓటుతో ఏమవుతుం దిలే అనే భావన ఎంతమాత్రం సరికాదని, ప్రజాస్వామ్య పరిరక్షణలో, మంచి పాలకులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటూ ఎంతో కీలకమైనదని సూచించారు. అప్పుడే ప్రజాస్వామ్యం మరింతగా పరిఢవిల్లు తుం దని సూచించారు. ఎన్నికల్లో క్రమం తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్న 80 ఏళ్ళు పైబడిన సీనియర్ సిటిజన్లు నాగుల సాయమ్మ, కొట్టూర్ ఇందిరా, అవధూత భూమయ్య, మెరుగు ఒడ్డెమ్మ, అంకం సుశీల, వై.నర్సయ్యలను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కొత్తగా నమోదైన యువ ఓటర్లు నబీలా నూరిన్, లోకేష్ గౌడ్ అంబటి, షేక్ సుమేర్, సయ్యద్ అబ్దుల్ రెహమాన్, అబ్దుల్ ఇర్ఫాన్, రాచర్ల భవన్ కుమార్ లకు కొత్త ఓటరు ఐ.డీలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా స్వీప్ అధికారి సురేష్ కుమార్, ఏ.ఓ ప్రశాంత్ తదితరులు పాల్గన్నారు.

## ఓటు అక్షర ఆకృతిలో విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని వివిధ రంగుల దుస్తులతో ఓట్ అక్షర ఆకృతిని ప్రదర్శించిన విద్యార్థులు అకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి, ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఒక వజ్రాయుధం లాంటిదని దాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు కిషన్, దేవన్న మహికాంత్, శ్రీనివాస్, రంగాచారి, పద్మ గోపాల్, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీలో ఎల్ఎల్‌బి రీ వాల్యుయేషన్ నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బి పరీక్షలకు రివాల్యుయేషన్ నోటిఫికేషన్‌ను శనివారం విడుదల చేశారు. ఎల్ఎల్‌బి రెండవ సెమిస్టర్ రెగ్యులర్/బ్యాక్‌లాగ్ థియరీ జనవరి 2025 పరీక్షకు హాజరైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఒక్కో పేపర్‌కు రూ.500 రివాల్యుయేషన్, ఫామ్‌కు రూ.25 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 29వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు పేర్కొన్నారు.

## టీయూ నూతన వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ. యాదగిరిరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ నూతన వెబ్‌సైట్‌ను వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు శనివారం ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న అధికారుల సమగ్ర వివరాలతో పాటు వర్సిటీ అందించే వివిధ కోర్సులు, అనుబంధ కళాశాలలు, అవి అందించే కోర్సుల వివరాలను ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వర్సిటీలో ఉన్న వివిధ విభాగాలతో పాటు పరీక్షల విభాగం, డైరెక్టరేట్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్, అడ్మిషన్ల విభాగం, ఐక్యూఏసీ, హాస్టల్స్ తదితర విభాగాల వివరాలు ఈ వెబ్సైట్‌లో పొందుపరిచారు. విద్యార్థులకు, కళాశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌లు, పరీక్షల తేదీలు తదితర విషయాలను ఎప్పటికప్పుడు వెబ్సైట్‌లో పొందుపరచనున్నట్టు ప్రొఫెసర్ యాదగిరి రావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీ. చంద్రశేఖర్, వెబ్సైట్ అండ్ నెట్వర్క్ డైరెక్టర్ డాక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరి, డాక్టర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

## పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ అందజేస్తున్న దాకూరిఉదయ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల బాలికల ప్రాథమిక పాఠశాలకు స్థానిక దాకూరి ఉదయ్ మైక్ సెట్ వితరణ చేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఈ మేరకు దాకూరి ఉదయ్ పాఠశాల ఉపాధ్యాయులకు రూ.10వేల విలువైన మైక్ సెట్‌ను తన తండ్రి దాకూరి గంగాధర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సున్నం శ్రీనివాస్ మాట్లాడుతూ మైక్ సెట్ ఉదయం ప్రార్థన సమయంలో, విద్యార్థులకు ఆటల సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం మైక్ సెట్‌ను వితరణ చేసిన దాకూరి ఉదయ్‌కి పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుజ్జేటి రవీందర్, జి.సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భాషిత పాఠశాలలో క్రీడా పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్



క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలలో శనివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల ప్రారంభోత్సవానికి హైకోర్టు అడ్వకేట్ బాలయ్య ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల వలన విద్యార్థులలో శారీరక ఆరోగ్యం, మానసిక ధృఢత్వం పెంచడానికి, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. వివేకానంద స్వామి ఆటలు మనకు ధైర్యం, సంకల్పం, సమర్ధతను నేర్పిస్తాయని ప్రతి ఆట మన జీవితంలోని సవాళ్లను అధిగమించడంలో సహాయపడుతుందని చెప్పారని తెలిపారు. దానితో పాటు విద్యార్థులలో సమాజ సేవ, సహకారం, స్నేహపూర్వక వాతావరణం పెరిగే అవకాశం ఉన్నదని అన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ.. ఆటలతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థలో అన్నదానం



విద్యార్థులకు అన్నదానం నిర్వహిస్తున్న తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని తపస్వి స్వచ్ఛంద సంస్థలో విద్యార్థిని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మామిడిపల్లికి చెందిన వడ్ల రాజమణి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదానంతో పాటు, పండ్లు పంపిణీ చేసినట్టు జనరల్ సెక్రెటరీ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపస్వి ఫౌండర్ పద్మావతి, డైరెక్టర్ శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో పిల్లలను చదివిస్తూ వారి ఉన్నతికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. కుల మత వర్గ విచక్షణ లేని సేవా భావనతో రేపటి పౌరులుగా వెలుగొందేలా తీర్చిదిద్దుతున్నట్టు, ఇక్కడ 120 మంది అరక్షిత చిన్నారులు ఉన్నారని వారికి అన్ని రంగాలలో ప్రావీణ్యత కలిగించేలా ఆటలు, పాటలు, వ్యాసాలు ఇతరాత్రా నేర్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, అడ్మిన్ ఇంచార్జి కవిత, పిఈటి ప్రదీప్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు బాధ్యతగా మసలుకోవాలి

- కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి
- వక్రమార్గాల పట్ల ఆకర్షితులై భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు
- మహిళల రక్షణ కోసమే షీ టీంలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

విద్యార్థులు ఎదుగుతున్న దశలో బాధ్యతగా మసులుకోవాలని.. వక్రమార్గాల పట్ల ఆకర్షితులై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోనాసముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో ఎస్ఐ అనిల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎదుగుతున్న క్రమంలో మత్తు పదార్థాలు, గంజాయి వంటి వాటికి ఆకర్షితులై విద్యార్థులు తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. సోషల్ మీడియాలో ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సప్‌ను పాఠశాల వయస్సులో వినియోగించకపోవడమే మంచిదన్నారు. సెల్‌ఫోన్ పరిమితి మేరకు మాత్రమే వాడాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని మన ఎదుగుదలకు మాత్రమే ఉపయోగించుకోవాలి తప్ప వ్యసనంగా మార్చుకొని భవిష్యత్తును పాడుచేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు కూడా బాధ్యతగా మసులుకోవాలని, తమ పిల్లలపై అతి మమకారం చూయించి కొందరు పాఠశాలలో టీచర్లపై దాడులకు దిగుతున్నారని ఇది ఎంత మాత్రం సరైనది కాదని హితవు పలికారు. తన తండ్రి కూడా స్కూల్ హెడ్మాస్టర్‌గా పని చేశారని, తన వద్ద విద్య నేర్చుకున్న ఎంతోమంది భవిష్యత్తులో ఉన్నత హోదాలకు ఎదిగారని గుర్తు చేశారు. మహిళల రక్షణ కోసమే షీటీమ్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మహిళలపై ఎవరు అనుచితంగా ప్రవర్తించిన మొహమాటం లేకుండా షీ టీం కాల్ సెంటర్ నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. అదేవిధంగా ఉన్నత చదువుల నిమిత్తం నిజామాబాద్, హైదరాబాద్ వంటి పట్టణాలలో ఉంటున్న విద్యార్థినులు తమ మొబైల్‌లో టీ సేఫ్ ఆప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని ఎస్ఐ కోరారు.

**విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి : ఐకెపి ఎపిఎం**

ఉన్నత పాఠశాల దశలో ఉన్నప్పుడే విద్యార్థులు తన భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఐకెపి ఏపియం కుంట గంగాధర్ పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసపు అంశాలను విద్యార్థులకు బోధించారు. ప్రతి విద్యార్థికి తన భవిష్యత్తుపై స్పష్టత ఉండాలని, తన లక్ష్యాన్ని తప్పనిసరిగా నిర్దేశించుకుని దాన్ని సాకారం చేసుకోవడానికి కృషి చేయాలన్నారు. ఎదిగే వయస్సులో ఎన్ని ఆకర్షణలు కనిపించినా అటువైపుగా తన దృష్టి మరలకుండా ఉండాలన్నారు. భవిష్యత్తులో ఒక హోదాను సాధించిన తర్వాత అన్ని రకాల భోగభాగ్యాలు వాటంతటవే వస్తాయని వెల్లడించారు. యుక్త వయస్సులో విద్య పట్ల శ్రద్ధ చూపకుండా వ్యసనాల బారిన పడితే భవిష్యత్తు అగమ్య గోచరం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నస్రీన్, ప్రతినిధులు, గ్రామస్తులు, గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో బోధన్ పట్టణాన్ని అభివృద్ధి చేశాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్



బోధన్ పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే సహకారంతో, కౌన్సిలర్ల సహకారంతో ఎంతో కృషి చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగిసిన సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధన్ పట్టణ అభివృద్ధికి ఆయా వార్డులలో నిధులు వెచ్చించి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించామని అన్నారు. ఐదు సంవత్సరాల పాటు బోధన్ మున్సిపల్ అభివృద్ధికి ఉద్యోగు లు, కౌన్సిలర్లు వార్డు ప్రజలు సహకరించినం దుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రతినిధులు అనేవారు అందరి సహకారం ఉంటేనే అభివృద్ధికి కృషి చేస్తారని కావున ప్రజలు భవిష్యత్తులో బోధన్ పట్టణ అభివృద్ధికి కృషి చేసే వారిని ఆదరిం చాలని కోరారు. అనంతరం కౌన్సిలర్లు ఐదేళ్ల కాలంలో వారు చేసిన అభివృద్ధి పనులను వివ రించారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, కమిషనర్ వెంకటనారాయణ, కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, శ్రీకాంత్, ధూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఉత్పత్తులు అమ్మేవారికే గాంధీగంజ్‌లో అవకాశం కల్పించాలి

- ఏఐకేఎస్) ఆధ్వర్యంలో మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ




మాట్లాడుతున్న ఏఐకేఎస్ నాయకులు

రైతు ఉత్పత్తులు అమ్మేవారికే గాంధీగంజ్ మార్కెట్‌లో అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో మార్కెట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. శనివారం నిజామాబాద్ గాంధీ గంజ్ మార్కెట్ యార్డ్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో గాంధీ గంజ్ మార్కెట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య మాట్లాడుతూ.. రైతు పండించిన పంటల ఉత్పత్తులకు సంబంధం లేని ఇతర వాణిజ్య వ్యాపారాలు వ్యవసాయ మార్కెట్ గాంధీ గంజ్‌లో నిర్వహిస్తూ ప్రస్తుతం రైతు ఉత్పత్తులు అమ్మేవారికి ఇబ్బందులకు గురిచేస్తున్నారని దీనిపై మార్కెట్ పాలకవర్గం, మార్కెట్ కమిటీ కార్యదర్శి స్పందించి రైతు ఉత్పత్తుల అమ్మే వారికే గాంధీగంజ్ మార్కెట్‌లో అవకాశం కల్పించాలని కోరుతున్నా మన్నారు. గత పాలకులు ఈ మార్కెట్లో బంగారం వ్యాపారం చేసుకోవడానికి మడిగెలు కేటాయించి రైతులకు, చిరు వ్యాపారులకు అన్యాయం చేశారని అన్నారు. గాంధీ గంజ్ మార్కెట్లో పెట్టుబడిదారులకు అవకాశం ఇస్తే దఫలవారి ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి అడ్డికే రాజేశ్వర్, నాయకులు సాయిలు, గంగాధర్, కూరగాయలు అమ్మే రైతులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

## నూతన పసుపు తవ్వే కొంకీతో క్షేత్రస్థాయి పరిశీలన

- స్థానిక పసుపు పరిశోధన స్థానంలో పసుపు తవ్వి కొంకి తయారీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలోని చౌట్‌పల్లిలో శనివారం నూతన పసుపు తవ్వే కొంకీతో క్షేత్రస్థా యి పరిశీలన నిర్వహించినట్లు మండల కేంద్రంలోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, పసుపు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బి.మహేందర్ తెలిపారు. పసుపు తవ్వే ఈ నూతన కొంకిని పసుపు పరిశోధన స్థానంలో తయారు చేసినట్లు వివరించారు. నూతనంగా తయారుచేసిన కొంకితో క్షేత్రస్థాయిలో పనితీరును పరిశీలించినట్లు తెలిపారు. దీనినే పెడల్ ఆపరేటర్ మాన్యువల్ టర్మరిక్ డిగ్గర్ అని కూడా అంటారని శాస్త్రవేత్త మహేందర్ తెలిపారు. సాంప్రదాయంగా తెలంగాణలోని రైతాంగం కొంకిలతో కూలీల ద్వారా పసుపును తవ్విస్తారన్నారు. దీనిలో కూలీలు ఎడమచేత్తో కోసిన కాండమును పట్టుకుంటూ కుడి చేత్తో కొంకీలతో తవ్వటం జరుగుతుందన్నారు. ఇది చాలా శ్రమతో కూడుకున్న పని అన్నారు. స్థానిక శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో కొత్తగా తయారు చేసిన కొంకిని నిటారుగా నిలబడి భూమిలో తొక్కుతూ పసుపు దుంపను అలసట లేకుండా పెకిలించవచ్చు అన్నారు. ఈ విధానం చాలా తేలికైందని, ఈ పద్ధతిని రైతుల సమక్షంలో క్షేత్రస్థాయిలో పరిశీలించినట్టు శాస్త్రవేత్త మహేందర్ తెలిపారు. రైతులు దీనిపట్ల ఆసక్తి కనబరచడమే కాకుండా సంతోషం వ్యక్తం చేశారు. అవసరమైతే ముస్ముందు దీనిలో ఇంకొన్ని మార్పులు చేపట్టి రైతులకు అందించనున్నట్టు వివరించారు. దీని బరువు 2.25 కేజీలు ఉండి మోయడానికి కూడా అనువుగా ఉంటుందన్నారు. ఈ క్షేతస్థాయి పరిశీలనలో శాస్త్రవేత్త పి.శ్రీనివాస్, పరిశోధన కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించింది కాంగ్రెస్సే : ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించిందే కాంగ్రెస్ పార్టీనని అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. కంఠేశ్వర్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు కావొస్తున్న సందర్భంగా బిజెపి గల్లీ నుంచి ఢిల్లీ వరకు "హమారా సంవిధాన్" "హమారా స్వాభిమాన్ " అనే నినాదంతో సంవిధాన్ గౌరవ అభియాన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు ఆనంద్ రావు, బీజేపీ ఎస్సి మోర్చా జిల్లా అధ్యక్షులు శివ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంకర్ లక్ష్మి నారాయణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, బీజేపీ నాయకులు కొండా ఆశన్న, మాయావర్ సాయిరాం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**బడా రామ్‌మందిర్ స్థలాన్ని పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే..**

గాజుల్‌పేట్ బడారామ్ మందిర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని శనివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పరిశీలించారు. ఇందూర్ నగరంలో అతిపురాతనమైన దేవాలయం బడా రామ్ మందిర్‌లో గోశాల పక్కన ఉన్న గడ్డివాముకు అగ్ని ప్రమాదం జరగటం దురదృష్టకరమన్నారు. మందిరానికి చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం, సెక్యూరిటీ లేకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆలయ కమిటీ, స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించుకోగా ఎమ్మెల్యే స్పందిస్తూ దేవాదాయ శాఖతో మాట్లాడి త్వరలో ప్రహరీ నిర్మాణంతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మినారాయణ, స్థానిక కార్పొరేటర్ బట్టు రాఘవేందర్, గోకుల్ గోసేవ సమితి అల్లాడి రాజు, కృపల్‌సింగ్, డివిజన్ బీజేపీ నాయకులు, బాలకృష్ణ, సుధాకర్, రమేష్, దీపక్, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

- డిఈఓకు ఫిర్యాదు

నవతెలంగాణ-ఆర్మూర్

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని టీజీవీపీ, ఏఐపిఎస్‌యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎస్.అఖిల్, డివిజన్ కార్యదర్శి గోపాల్ సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాలలో కూడా క్లాసులు నిర్వహిస్తున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రభుత్వ ఆదేశం రాకముందే అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆఫర్లు, డిస్కౌంట్‌ల పేరుతో అడ్మిషన్లు చేస్తున్నారని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు చేస్తున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా సెలవు రోజులలో కూడా క్లాసులు నిర్వహించడం వల్ల విద్యార్థులలో మానసికపరమైన ఒత్తిడి వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విధంగానే నారాయణ హైదరాబాద్ బ్రాంచ్‌లలో విద్యార్థులు ఒత్తిళ్లకు లోనై, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కావున అక్కడ జరుగుతున్న తప్పిదం ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని నారాయణ పాఠశాలలో అలాంటి ఘటనలు జరగకుండా ముందస్తుగా నారాయణ పాఠశాలపై డీఈఓ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు సుజిత్, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను అయోమయానికి గురిచేయొద్దు

- అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సారా సురేష్
- ప్రభుత్వం ఇచ్చిన భూములకు రైతు భరోసా ఇవ్వాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రైతు భరోసా విషయంలో ప్రభుత్వం రైతులను అయోమయానికి గురి చేయడం తగదని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సారా సురేష్ అన్నారు. శనివారం మండలంలోని హసకొత్తూర్ గ్రామంలో భూ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సారా సురేష్ మాట్లాడుతూ.. అనేక పోరాటాల ద్వారా 2006-07 సంవత్సరాలలో నాటి వైయస్ రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే నెంబర్ 574లో భూమిలేని నిరుపేదలు భూములను చదునుచేసి, భూమిని ఆక్రమించిన తర్వాత ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. 113 మందికి 113 ఎకరాల భూమిని పంపిణీ చేసిందని గుర్తుచేశారు. లబ్ధిదారులందరూ ఉమ్మడిగా వ్యవసాయం చేసేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా భూమిని చదును చేసి జట్రోపా సాగు చేసిన నీటి సౌకర్యం లేక సాగు కాలేదన్నారు. ఆ తర్వాత రెండు సంవత్సరాలకు ఆముదం, సోయా, ఉలువలు పంటలు వేసి పది సంవత్సరాలుగా సాగు చేసి అనేక రకాలుగా నష్టపోయి 2022 నుంచి ఆ భూములలో పంటలు వేయడం మానేశారన్నారు. 9 సంవత్సరాల కాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు పేరుతో ప్రతి రైతుకు రూ.పదివేలు రైతుల ఖాతాలో పడేవి అన్నారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంగా రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని రేవంత్‌రెడ్డి సర్కార్ హామీనిచ్చి నేటి వరకు ఇయ్యకపోగా, ప్రస్తుతం ఆ పంటలకు రాదని చెప్పడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఒక దిక్కు పంట పండే భూములు అన్నింటికీ రైతు భరోసా ఇస్తామని మంత్రులు ప్రకటిస్తుంటే, అధికారులు వచ్చి మీరు పంటలు పెట్టలేదు. మీకు రైతు భరోసా ఇవ్వం అని రైతులను అయోమయానికి గురి చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి వరద కాలువ నుంచి రెండు కిలోమీటర్ల దూరం నీళ్ల తీసుకువచ్చినట్టయితే రెండు పంటలు పండే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఇంజనీర్లను పంపించి వరద కాలువ లబ్ధిదారుల భూముల సమీపంలోని చెరువు వరకు పైపులైన్ల ద్వారా నీటిని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం అందించిన భూములకు తప్పనిసరిగా రైతు భరోసా ఇవ్వాలని, లేనిపక్షంలో చలో కలెక్టరేట్ కార్యక్రమంతో ముట్టడిస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ కమ్మర్‌పల్లి మండల కార్యదర్శి బి.అశోక్, ఉట్నూర్ బాలయ్య, టి.బాలకిషన్, పెద్ది రాజేశ్వర్, డి.రాజేశ్వర్, అశోక్, రాజన్న, రమేష్, భూ లబ్ధిదారులు 70 మంది పాల్గొన్నారు.

## నవగ్రహ ప్రతిష్ట కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామంలో గల శ్రీ భవానీల సమేత బంగారు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం తృతీయ వార్షికోత్సవానికి రావాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌ను ఆహ్వానించినట్టు బిజెపి సీనియర్ నాయకుడు దత్తాద్రి గౌడ్ తెలిపారు. ఈ నెల 31 నుంచి వచ్చేనెల 2వరకు జరిగే కార్యక్రమానికి ఎంపీ హాజరు కావాలని ఆహ్వానించినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు ఏ శ్రీనివాస్, సుదర్శన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగం

**నవతెలంగాణ-రామారెడ్డి**

ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగంగా, భారత ప్రజాస్వామ్య రాజ్యాంగమని, మనందరికీ గర్వకారణమని ఎంపీడీవో తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని స్కూల్ తాండాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల పరిధిలో గల అంగన్వాడీ కిశోర బాలలకు ఏకరూప దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, అంగన్వాడి సిబ్బంది, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు బలరాం, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు


ఏకరూప దుస్తులు అందజేత

## విద్య వైద్య రంగాన్ని బలోపేతం చేయాలి

**నవతెలంగాణ-కామారెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య రంగాన్ని బలోపేతానికి తగిన నిధులు కేటాయించాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరిగాద సిద్ధిరాములు డిమాండ్ చేశారు. బిఎల్ఎఫ్ 7వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్ పి జిల్లా కార్యాలయం వద్ద జరిగిన బిఎల్ఎఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనీ ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలతో పాటు విద్య వైద్య రంగాన్ని బలోపేతానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

# ఓటు చాలా విలువైనది



మద్నూర్‌లో


పిట్లంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు..


గాంధారిలో అవగాహన ర్యాలీ

- ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం లాంటిది
- ఘనంగా 15వ జాతీయ ఓటర్ దినోత్సవం
- ఓటరుగా నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన, ప్రతిజ్ఞ

**నవతెలంగాణ-విలేకరులబృందం**

ఓటుహక్కు చాలా విలువైనదని పలువురు తెలిపారు. ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం లాంటిదని, అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకొని తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. 15వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటరుగా నమోదు, ఓటు హక్కు ప్రాముఖ్యతపై జిల్లా వ్యాప్తంగా శనివారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు.

**మద్నూర్ :** డోంగ్లి మండల కేంద్రంలో తహసీల్దార్ రేణుక చౌహన్ ఆధ్వర్యంలో ఓటర్ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆధ్వర్యంలో ర్యాలీ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. ఓటు ఎంతో విలువైనదని ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షించుకోవాలని కోరారు.

**ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయుధం వంటిది**

ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయుధమని, ఓటే ఒక టానిక్ వంటిదని, ఓటుహక్కును ప్రతిభారతీయుడు ఉపయోగించుకోవాలని ప్రిన్సిపాల్ నందాల గంగాకిషోర్, ప్రముఖ పద్యకవి, సంస్కృతోపన్యాసకులు బి. వెంకట్ అన్నారు. మద్నూరు తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సామూ హికంగా ఓటర్ల ప్రతిజ్ఞను చేశారు.

**పిట్లం:** మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ ఓటర్ల దినోత్సవం తాహసిల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర హై స్కూల్ తో పాటు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఓటు హక్కు నిమిత్తం ప్రతిజ్ఞ నిర్వహించారు.

**నాగిరెడ్డిపేట్:** అంతర్జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞ విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గీతా, ఆర్ ఐ మహమ్మద్ ఉన్నారు.

**కామారెడ్డి:** ఓటు హక్కు విలువను కాపాడాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ ఓటరు దినోత్సవం 2025 ను భారత ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకొని ఓటుహక్కు విలువను కాపాడాలని అన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన వారందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముందు భారత ఎన్నికల కమీషనర్ సందేశాన్ని వినిపించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి సర్టిఫికెట్, మెమెంటోలు అందజేశారు. వయో వృద్ధురాలు, యంగ్ ఓటర్లను, థర్డ్ జెండర్ లను శాలువాలతో సత్కరించారు.

**ఎమ్మార్వో శివప్రసాద్**

**భిక్కనూర్ (రాజంపేట్):** ఓటు హక్కు శక్తివంతమైన ఆయుధమని మండలం తహసీల్దార్ శివప్రసాద్ తెలిపారు. శనివారం రాజంపేట్, భిక్కనూర్ మండల కేంద్రాలలో జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఓటర్ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. ఓటును నోటుకు అమ్ముకోవద్దని, న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ఆదరణ కల్పిస్తుందని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**కామారెడ్డి:** ఆర్కే గ్రూప్ ఆఫ్ కళాశాలల్లో ఆర్ కె, ఎస్ఆర్‌కే, విఆర్‌కే కళాశాలలలో ఓటర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ గౌడ్, ముఖ్య అతిథిగా విచ్చేసి ఓటు ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆర్కే సీఈవో డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చైతన్యంతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సైదయ్య, నవీన్, గోవర్ధన్, గంగాధర్, వైస్ ప్రిన్సిపల్స్, ఎన్ఎస్ ఎస్ స్ పిఓస్ లింగం, రాజు, నర్సారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

**మద్నూర్:** ఓటు అమూల్యమైనదని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ప్రభుత్వ గురుకుల ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు, ర్యాలీ నిర్వహించారు. గాంధీ చౌక్ ఆవరణంలో కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా అదనప కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరుగా అర్హులైన వారు తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఎండి ముజీబ్, మండల ఎంపీడీవో రాణి, మండల ఎంఈఓ రాములు నాయక్, ఆర్ఐ శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమాన్ స్వామి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అనుమంతు యాదవ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఓట్ ఫర్ ఇండియా..**

**మద్నూర్ :** జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా విద్యార్థులు ఓట్ ఫర్ ఇండియా ఆకారంలో కూర్చొని ఓటరు ప్రాముఖ్యతను చాటి చెప్పారు. విద్యార్థులు చాటిచెప్పిన ఆకారంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, నాగనాథ్, భీమ్, మంజీరా, పి.డి.ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

**తాడ్వాయి:** ఓటును ప్రతి ఒక్కరు నిర్భయంగా వినియోగించుకోవాలని తహసిల్దార్ రహీముద్దీన్ అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, ఉపాధ్యాయులు ఆర్, రాజా గౌడ్, పిడి, సంగారెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**గాంధారి:** గాంధారి మండల కేంద్రంలో శనివారం జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని 15వ జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలలో భాగంగా గాంధారిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించి తహసీల్దార్ సతీష్‌రెడ్డి అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎస్సై ఆంజనేయులు, డిప్యూటీ తాసిల్దార్ రవీందర్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర గౌడ్, ఆర్ ఐ ప్రదీప్ తాసిల్దార్ , ఎంపీడీవో కార్యాలయుల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**నిజాంసాగర్:** దేశ పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, 18 సంవత్సరాలు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరు తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు పొంది ఎన్నికల సమయంలో కచ్చితంగా వినియోగించుకోవాలని మండల రెవెన్యూ అధికారి బిక్షపతి అన్నారు. శనివారం మండలంలో నిర్వహించిన 15వ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## నీళ్ల కోసం తంటాలు

- బిందెలు పెట్టి ఎదురుచూపులు


నీళ్ల కోసం బిందెలతో లైన్ కట్టిన గ్రామస్తులు

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

పెద్ద కొడప్ గల్ మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు గత నాలుగు రోజుల నుండి గ్రామంలో సరఫరా లేకపోవడంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. బూరుగుపల్లి గ్రామంలోలో బోరు బావులు లేకపోవడంతో జనాలకు మిషన్ భగీరథ నీళ్లే దిక్కని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో నాలుగు రోజుల నుంచి భగీరథ నీళ్లు రాకపోయే సరికి కష్టాలు మొదలైందని తెలిపారు. మిషన భగీరథ నీళ్లు సరఫరా అయ్యే సమయంలో ఆ నీళ్లతో బావిని నింపుకొని మిషన్ భగీరథ నీళ్లు రాన్నపుడు గ్రామస్తులకు బావి నుండి ఎత్తి పోసి సరఫరా అవుతుందని జనాలు అంటున్నారు. బోర్లు వేసినా నీళ్లు పడట్లేదని, దింతో తమ గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లే దిక్కని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## జాతీయ సమైక్యతా శిబిరానికి బి.మానస ఎంపిక



**నవతెలంగాణ-సదాశివనగర్**

జాతీయ సమగ్రత శిబిరానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ బి మానస బిఎస్సిబిజడ్, సి.తృతీయ సంవత్సరం విద్యార్థిని , కామారెడ్డి సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల నుండి ఎంపిక అయ్యారు. ప్రిన్సిపాల్ డా.సి. శోభారాణి అభినందనలు తెలియజేసారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సమాజ సేవలో తమ వంతుగా సమాజం నుండి మాదకద్రవ్యాల నిర్మూలన కు, ప్లాస్టిక్ నిర్మూలకి కృషి చేయాలని సూచంచారు. అలాగే వైస్ ప్రిన్సిపాల్స్ శ్రావణి, మీనా, అధ్యాపక, అధ్యాపకేతర బృందం ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి చంద్రకళ అభినందనలు తెలియజేశారు.

## అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం


- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**నవతెలంగాణ-నిజాంసాగర్**

జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శనివారం ఆయన నిజాంసాగర్ మండలంలోని వెలగనూరు, మంగుళూర్, నర్సింగరావుపల్లి, మాగి గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సిసి రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం మొత్తం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడం తన లక్ష్యమని చెప్పారు. గ్రామాల్లో పర్యాటక, విద్య, వైద్య, రోడ్డు మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు అనేక పథకాలను చేపడుతున్నట్టు ఆయన వెల్లడించారు. అనంతరం మండలంలోని కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి బిక్షపతి, నాయకులు పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చికోటి మనోజ్ కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, ప్రజాపండరి తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో మాక్ ఎలక్షన్


విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట గ్రామంలో గల తెలంగాణ మోడల్ స్కూల్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మాక్ ఎన్నికలు నిర్వహించారు. పదో తరగతికి చెందిన నలుగురు విద్యార్థులు నాలుగు రోజుల క్రితం నామినేషన్లు దాఖలు చేసి పాఠశాల ఆవరణలో ప్రచారం నిర్వహించారు. 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులందరూ బ్యాలెట్ పేపర్ల ద్వారా తమ ఓటు వేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయింది. కె. అంకిత్‌కు 191, బి. కీర్తి వర్ధన్‌కు 167, ఎం. కీర్తి సాయికి 103, ఎన్.నికితకు 101 ఓట్లు వచ్చాయి. హెడ్ గర్ల్‌గా ఎన్.కీర్తి సాయి, హెడ్ బాయ్‌గా కె.అంకిత్‌ని ప్రకటించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ప్రిన్సిపల్) హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌కు ఎన్నికల ఫలితాల ధృవీకరణ పత్రాలను జారీ చేశారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**నవతెలంగాణ-కామారెడ్డి/నాగిరెడ్డిపేట్**


కామారెడ్డిలో..

కామారెడ్డి పట్టణంలోని 14వ వార్డ్ పరిధిలో రూ. 25లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియా చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ పాత శివ కృష్ణమూర్తి, కాలనీవాసులు గోవర్ధన్ రెడ్డి, లక్ష్మి నారాయణ, సబ్బనీ కృష్ణహరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**నాగిరెడ్డిపేట్:** నాగిరెడ్డిపేట్ మండలంలోని బొల్లారం గ్రామంలో శనివారం రోజు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి డివిటి కిష్టయ్య మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా భావిస్తూ గ్రామాలలో ఎమ్మెల్యే సిసి రోడ్లను మంజూరు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు అనంతరాజు, సీనియర్ నాయకులు ప్రభు గౌడ్, ఉస్మాన్, ధర్మవీర్, మండల మహిళా అధ్యక్షురాలు చంద్రకళ, ఆవుసుల రమేష్, గొల్ల సాయిలు, పండరి, దశరథం, హజార్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీశబరీ మాత ఆలయ కమిటీ ఎన్నిక

**నవతెలంగాణ-తాడ్వాయి**

మండల కేంద్రంలో శ్రీ శబరీ మాత ఆలయ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా అనంతరావు సజ్జన (మెదక్), కార్యదర్శిగా కృష్ణమూర్తి (తూప్రాన్), కోశాధికారిగా శ్రీనివాస్ (కరీంనగర్), ఉపాధ్యక్షులుగా బసవన్న (బీదర్), శంకర్ (కరీంనగర్), డాక్టర్ రామలింగం (కామారెడ్డి), సలహాదారులుగా మల్లేశం (కరీంనగర్), నల్లవెల్లి గంగారెడ్డి (తాడ్వాయి), మాజీ సర్పంచ్ బండారి సంజు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు, మేకల రాజు ఎన్నిక అయ్యారు. గ్రామ పెద్దలు మద్ది మహేందర్ రెడ్డి, జంగం రాజు, ముదాం నర్సింలు, అంబీర్ శ్యామ్ రావు, ఏనుగు రాఘవరెడ్డి,అంబీర్ బాలకృష్ణ రావు ఆధ్వర్యంలో ఎన్నిక లు నిర్వహించినట్టు తెలిపారు.

## టీజీవిపి కామారెడ్డి జిల్లా కార్యదర్శిగా నవీన్ నియామకం

**నవతెలంగాణ-కామారెడ్డి**

టీజీవిపి కామారెడ్డి జిల్లా కార్యదర్శిగా నవీన్ నియమించినట్టు జిల్లా ఇన్‌చార్జి అనిరుద్ రాజు తెలిపారు. కామారెడ్డి జిల్లా గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆవరణలో తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భానుచందర్ ఆచార్య ఆదేశాల మేరకు శనివారం కామారెడ్డి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. సంస్థను బలోపేతం చేయాలని, ప్రతి కళాశాలలో కమిటీలు, మండల కమిటీలు వేయాలన్నారు. అనంతరం నియామక పత్రం అందజేశారు.

# జోరుగా మొరం తవ్వకాలు


జేసీబీతో కొనసాగుతున్న మొరం తవ్వకాలు

**నవతెలంగాణ-భిక్కనూర్**

మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న సాయిబాబా ఆలయం వెనకాల జోరుగా మొరం తవ్వకాలు సాగుతున్నట్టు గ్రామస్తులు ఆరోపించారు. బావులను, చెరువులను తలపించేలా గుంతలు చేస్తూ మొరం అంతా ఒకచోట నిలువచేసి అవసరం ఉన్నప్పుడు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేట్ భూములలో మొరం తవ్వకాలు చేపడితే మైనింగ్, తహసిల్దార్ అధికారుల అనుమతి తీసుకుని తవ్వకాలు నిర్వహించాల్సి ఉంటుంది. మొరం తవ్వకాల నిర్వాహకులు తమకు ఎలాంటి అనుమతి అవసరం లేదన్నట్లు ఇష్టానుసారంగా మొరం తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఇదంతా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులకు తెలిసి జరుగుతుందా..? తెలియక జరుగుతుందా..? తెలియాల్సి ఉంది. అధికారుల చేతులు తడపగానే ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా ఆదేశాలిచ్చారా అన్న అనుమానాలకు తావిస్తోంది. అడ్డు అదుపు లేకుండా మొరం తవ్వకాలు జరుగుతుంటే మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదు..? ఒకవేళ ఫిర్యాదులు చేస్తే అధికారులే సమాచారం ఇచ్చి అక్కడి నుంచి పంపిస్తున్నారా అన్న విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. సాయిబాబా ఆలయం వెనకాల బావులను, చెరువులను తలపించే తవ్వకాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన హెచ్ఎం

**నవతెలంగాణ-లింగంపేట్**

లింగంపేట్ మండలానికి చెందిన నల్లమడుగు ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు రాష్ట్రస్థాయి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ గేమ్స్ ఆధ్వర్యం లో జాతీయస్థాయి పోటీలకు ఆయన ఎన్నికయ్యారు. మండల పిఆర్టియు టిఎస్ ఆధ్వర్యంలో శనివారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పి ఆర్ టి యు టి ఎస్ అధ్యక్షులు రవీంద్ర శర్మ ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సుధాకర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్ గౌడ్, మండల అసోసియేట్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి భారీ పెట్టుబడులు హర్షణీయం

**నవతెలంగాణ-బీబీపేట్(కామారెడ్డి)**

ప్రపంచ ఆర్థిక సదస్సు-2025 దావోస్ వేదికగా తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావడం హర్షణీయం అని జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్‌గౌడ్ తెలిపారు. గత పదేళ్ళలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడుల రికార్డు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ బృందం ఒప్పందాలు కుదుర్చుకుని ముందెన్నడూ లేనిరీతిలో చరిత్ర సృష్టించింద న్నారు. 16 ప్రముఖ కంపెనీలు సుమారు రూ.1.78 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నాయని ఈ ప్రాజెక్టుల వల్ల సుమారు 49,550 మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం తెలిపడమే దీనికి నిదర్శనమన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**నవతెలంగాణ-సదాశివనగర్**

మండలంలోని జాతీయ రహదారిపై అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసుల వివరణ ప్రకారం మృతుడు లింగాపురం రవి (36) కామారెడ్డి నుండి స్వగ్రామం ఇందల్‌వాయి మండలం నల్లవెల్లికి వెళ్తుండగా వెనుక నుండి వాహనాం ఢీకొట్టినట్టు తెలిపారు. మృతుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఆయన భార్య పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

## పిల్లలను బడికి రెగ్యులర్‌గా పంపాలి


మాట్లాడుతున్న ప్రధానపాధ్యాయులు

**నవతెలంగాణ-జుక్కల్**

ప్రభుత్వ బడులలో చదువుకుంటున్న ప్రతి పేద విద్యార్థులకు తల్లిదండ్రులు కచ్చితంగా పాఠశాలలకు పంపి విద్యాబోధన చేయిం చేందుకు తల్లిదండ్రులు సహకరిం చాలని జుక్కల్ జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు బాధ్యతగా మెలిగినప్పుడే వారిచ్చే సహకారంతో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించగలుగుతామని తెలిపారు.

గతంలో వాష్ రూమ్లు సరిగా లేకపోవడం తాగునీరు సౌకర్యం ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న పిల్లలకు ప్రస్తుతం వాష్ రూమ్ పైప్ లైన్ నిర్మాణం చేశామని హెచ్ఎం తెలపడంతో మేజర్ సమస్యల పరిష్కారం జరగడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## ముగిసిన బార్ క్రీడాపోటీలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలు శనివారం ముగిసినట్టు బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ తెలిపారు. క్రికెట్, చెస్, క్యారమ్స్, షెటిల్, న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య స్నేహపూర్వకంగా జరిగినట్టు తెలిపారు. శనివారం నిజామాబాద్ నగరంలోని నాగారం స్టేడియంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య జరిగిన క్రికెట్ పోటీలో న్యాయమూర్తుల జట్టు 10 ఓవర్లలో 04 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేశారు. న్యాయవాదుల జట్టు 92 పరిగులు చేసి ఓటమిపాలయ్యింది. విజేతలకు రిపబ్లికన్ డేన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతుల ప్రదానం చేయనున్నట్టు జగన్ గౌడ్ పేర్కొన్నారు.

## సాయి ఒకేషనల్ కళాశాలలో సంవిధాన్ గౌరవ అభియాన్



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని పట్టణంలోని సాయి ఒకేషనల్ జూనియర్ కాలేజీలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయకుడు సంతోష్ , బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్, బిజెపి పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, సాయికుమార్, బీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు భాషెట్టి రాజ్ కుమార్, బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షుడు పెద్దోళ్ల భరత్, తదితరులు పాల్గొన్నారు.

## అమీనాపూర్ వద్ద కారు బోల్తా

- ఒకరు మృతి

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని అమీనాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి కారు బోల్తా పడగా జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన యువరైతు శ్రావణ్‌రెడ్డి (35)మృతి చెందినట్టు ఎస్సై సంజీవ్ శనివారం తెలిపారు. ఈయన కుటుంబ సభ్యులతో వేల్పూర్‌కు వెళ్లి తిరిగి ఆర్మూర్ వైపు వస్తుండగా అమీనాపూర్ గ్రామ శివారులో కారు చెట్టును బలంగా ఢీకొని, కారు పల్టీలు కొట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైన వారిని 108 అంబులెన్సులో పట్టణ ఆసుపత్రికి తరలించారు. ఆయన మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

## 68వ స్కూల్ గేమ్స్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థి





నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

68వ స్కూల్స్ గేమ్స్ జాతీయ సాఫ్ట్బాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి జక్కం శ్రావ్య పాల్గొంటున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగామోహన్ తెలిపారు. ఇటీవల మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్ర స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్-19 పోటీలలో జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించడంలో కీలకపాత్ర పోషించి ఈనెల 24 నుంచి 28 వరకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియం, శంభాజీనగర్, మహారాష్ట్రలో జరుగుతున్న 68వ జాతీయ స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్-19 పోటీలలో పాల్గొంటున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని జక్కం శ్రావ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఎం శ్రీనివాస్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ఎంపీ బండి సంజయ్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎంపీ బండి సంజయ్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న మండలోజు నరసింహస్వామికి శుక్రవారం నిర్వహించిన రాజరాజేశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కరీంనగర్‌లో డాక్టర్ మండలోజు నర్సింహ స్వామి రచించిన డాక్టర్ వెలిచాల కొండల రావు జీవితము - వ్యాయసేవ" అనే పుస్తకాన్ని ఎంపీ బండి సంజయ్, కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ, డా.వెలిచాల కొండలరావు, గంద్ర లక్ష్మణరావ్, అంపశయ్య నవీన్, అనుమాండ్ల భూమయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. వెలిచాల కొండలరావు మాతృభాష పరిరక్షణ కోసం ఇంకా పరితపించే వారిలో వీరు మొదటి స్థానంలో ఉంటారని ఇలాంటి గొప్ప వ్యక్తిపైన డాక్టర్ మండలోజు నర్సింహ స్వామి పుస్తకం రాయడం అనేది చాలా గొప్ప విషయమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ, డా.వెలిచాల కొండలరావు, గంద్ర లక్ష్మణరావ్, అంపశయ్య నవీన్, అనుమాండ్ల భూమయ్య, కళాశాల యాజమాన్యం విద్యార్థులు పాల్గొన్నారు.

## నిశిత ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్ ముగింపు



స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

క్రీడాస్ఫూర్తి, శ్రేష్ఠత సంస్కృతిని పెంపొందించడంలో నిబద్ధతతో నిషిత ఇంటర్నేషనల్ స్కూల్‌లో 4 రోజుల స్పోర్ట్స్ మీట్ మహోత్సవం ముగింపు వేడుకలో ప్రఖ్యాత అంతర్జాతీయ బాక్సింగ్ ఛాంపియన్ మహమ్మద్ హుసాముద్దీన్, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ టెక్నికల్ అడ్వైజర్ అయిన మహమ్మద్ యాసీన్ హాజరై విద్యార్థులకు క్రీడల పట్ల మక్కువ పెంచుకునేలా ఉత్తేజపరిచేలా ప్రోత్సహించారు. బాస్కెట్‌బాల్, క్యారమ్, చెస్, హర్డిల్ రేసెస్, అనేక ఇతర క్రీడలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, చీఫ్ ప్యాట్రన్ వినయ కుమార్, చైర్మన్ నిఖిల్ చౌడవరం, డైరెక్టర్ పూజా చౌడవరం, నిషిత డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ రమీందర్ కౌర్ మోడీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## జేఎంకెపిఎం పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘం సందర్శన





మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మనోహరాబాద్ గ్రామంలోని జేఎంకేపిఎం పసుపు రైతుల ఉత్పత్తి దారుల సంఘాన్ని గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన మున్నంగి గ్రామం కొల్లిపర మండలం పసుపు రైతులు ఈద శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, సతీష్‌రెడ్డి, వంగారెడ్డి, తదితర రైతులు, దుగ్గిరాల పసుపు మార్కెట్ నుంచి వచ్చి పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జేఎంకే పిఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ అల్లూరి సంతోష్‌రెడ్డి వారికి పరిశ్రమ విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పాటుకూరి తిరుపతిరెడ్డి, పడకల్ బోన్ల శ్రీధర్ పాల్గొన్నారు.

# ఓటుకు నోటు ఇవ్వొద్దు

- పనులకు కమీషన్లు తీసుకోవద్దు
- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నాయని ఈ ఎన్నికల్లో మహిళలకే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తుందని కాబట్టి ఓటుకు నోటు ఇవ్వొద్దని తర్వాత అభివృద్ధి, సంక్షేమ పథకాలలో కమీషన్లు తీసుకోవద్దని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఇంటి దీపం మాక్స్ ఆధ్వర్యంలో హెచ్‌పీ పెట్రోల్ బంకును ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబాలు బాగుపడతాయని అందులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి దీపం మాక్స్ లాంటి మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. సంఘం ఆధ్వర్యంలో రైతులకు ఎరువులతో పాటు స్ప్రే చేసేందుకు డ్రోన్ల సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తుండడం హర్షించదగ్గ విషయమని అన్నారు. అలాగే మహిళా సంఘం ఆధ్వర్యంలో కూరగాయల సాగు చేస్తే తన పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. బీరకాయ, కాకరకాయ లాంటి పంటలు పండిస్తే ఎకరానికి లక్ష రూపాయలకుపైగా లాభం వస్తుందని అన్నారు. వచ్చే సీజన్లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సైతం ఇంటి దీపం మాక్స్ మహిళా సంఘానికి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ వారు జరిపిన సర్వేల్లో పాలల్లో కల్తీ కారణంగా 80 శాతం ప్రజలకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. కాబట్టి సర్కారు పాలు అయినటువంటి విజయ డెయిరీ పాల పదార్థాలను వినియోగించుకోవాలని కోరారు. కేసీఆర్ దౌర్జన్యానికి భావితరాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడిందని కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ సంక్షేమంతో పాటు రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఉపాధ్యాయుల రిక్రూట్మెంట్‌లను చేపడుతుందని, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఫలితాలు వచ్చే విధంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. గాడితప్పిన వ్యవస్థను బాగు చేయడం కోసమే తాము అహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు సహకరిస్తే షుగర్ ఫ్యాక్టరీని స్థాపిస్తామని అన్నారు. అనంతరం జన్నెపల్లి మాటు కాలువను పరిశీలించి సాగునీటి విషయమై రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్‌చందర్, నిజామాబాద్ ఆర్డిఓ, ఏసిపి, మ్యాక్స్ సీఈవో జేబన్నా, జిల్లా అధ్యక్షురాలు చిన్న గంగు, మండల అధ్యక్షురాలు బేగరి లక్ష్మి, ఓఎమ్ నిర్మల, మేనేజర్ శోభ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

# సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు తరలిన నాయకులు

నవతెలంగాణ-నవీపేట్/బోధన్

మండలం నుంచి సంగారెడ్డి పట్టణంలో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల బహిరంగ సభకు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక, కర్షక, నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాటం చేసే పార్టీ సీపీఐ(ఎం) మహాసభలను జయప్రదం చేయడానికి తరలివెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రమాదేవి, రాజశేఖర్, సావిత్రి, సాయిలు, వసంత్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

**బోధన్ :** సీపీఐ(ఎం) 4వ రాష్ట్ర మహాసభలకు బోధన్ నుంచి భారత కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీ నాయకులు వాహనాలలో సంగారెడ్డికి శనివారం తరలివెళ్లారు. బోధన్ నుంచి తరలిన వారిలో కార్యదర్శి జంబిశెట్టి శంకర్ గౌడ్, ఏరియా కమిటీ సభ్యులు గంగాధర్, జంగం గంగాధర్, ఎస్.సాయిలు, మీనా, పార్టీ సభ్యులు ఉన్నారు.



నవీపేట్: మహాసభకు తరలిన నాయకులు



బోధన్‌లో...

# విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేయాలి

- బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య రంగాన్ని బలోపేతానికి తగిన నిధులు కేటాయించాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) (బిఎల్‌పి)రాష్ట్ర అధ్యక్షులు, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం బిఎల్ఎఫ్ 7వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్‌పి జిల్లా కార్యాలయం వద్ద జరిగిన బిఎల్ఎఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లను, సిబ్బంది నియమించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్య రంగాన్ని బలోపేతానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటి నాయకులు మేత్రి రాజశేఖర్, జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





నినాదాలు చేస్తున్న బిఎల్ఎఫ్ నాయకులు

## డీఈవో చేతుల మీదుగా క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ క్యాలెండర్‌ను జిల్లా సమీకృత కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు శ్రీనివాసరావు, జీవన్, శ్రీధర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

**కేజీబీవీ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ..**

ప్రగతిశీల కేజీబీవి నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈఓ. పి.అశోక్ చేతులమీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి.ఈశ్వరి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత, జిల్లా కార్యదర్శి సుమలత, జిల్లా ఉపాధ్యక్షులు సుజాత, ప్రశాంతి, సహాయ కార్యదర్శులు సంధ్య, దివ్య, జిల్లా కోశాధికారి శోభ, జిల్లా నాయకులు లత తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయించాలి



పీసీసీ అధ్యక్షులుతో మాట్లాడుతున్న కళాశాలల యాజమాన్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయించాలని పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడిని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల బృందం శనివారం కలిసి అభ్యర్థించారు. గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు విడుదల కాకపోవడంతో కాలేజీల నిర్వహణ కష్టంగా మారిందని కాలేజీల యాజమాన్యాలు పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. వేల మంది విద్యార్థులు ఉచితంగా చదువుకుంటున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో అటు విద్యార్థులు ఇటు కళాశాలల సిబ్బంది చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత సంవత్సర కాలం నుంచి సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. భవనాల అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల నుంచి యాజమాన్యాలు పాల్గొన్నారు.

## జీవిత బీమాతో కుటుంబానికి ఆర్థికభరోసా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జీవిత బీమాతో కుటుంబానికి ఆర్థికభరోసా కలుగుతుందని నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. జిల్లా కేంద్రంలో సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని టాటా ఏఐఏ నిజామాబాద్ బ్రాంచ్ ఉద్యోగులు, అడ్వైజర్స్ కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నుడా చైర్మెన్ మాట్లాడుతూ.. ఒక కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా చితికి పోతుందని, ఒక్కసారిగా వారి జీవితాలు తారుమారవుతాయని పేర్కొన్నారు. అలాంటి ఆర్థిక సంక్షోభం నుంచి ఆ కుటుంబానికి ఆర్థికంగా ఆదుకునేది కేవలం జీవిత బీమానే అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హబీబ్, మియా, పవిత్ర, సిరిపురం రవీందర్, శారద నీరడి, భవానీ, సదామస్తుల తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను నేరవేర్చుదాం



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చుదామని, బడుగు బలహీన వర్గాల కోసం అయన చేసిన సేవలను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగాలని బిజెపి ఇందల్ వాయి మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామంలో అధ్యక్షులు లోలం సత్యనారాయణ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి 70 సంవత్సరాలు కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను అవమాన పరిచిందని, అంబేద్కర్ చేసిన సేవలను గాను ఆయన అమలు పరిచిన అంశాలను గాని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకునేది కాదని, ఆనాటి పార్లమెంట్ సభలో నుండి నెట్టి వేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని చెప్పారు. కానీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేద్కర్ ఆశయాలను అక్కున చేర్చుకొని నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం బూత్ అధ్యక్షులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నాయుడి రాజన్న, మండల ఉపాధ్యక్షులు అశోక్, లోకాని గోపి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక వికాసం

- ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విక్రాంత్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

క్రీడలతోనే మానసిక వికాసం కలుగుతుందని ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ విక్రాంత్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఘన్పూర్ గ్రామంలో వందేమాతరం ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జనవరి 23 నుండి 25వరకు వార్షిక క్రీడా సమావేశం నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టి.ఎం.విక్రాంత్ తెలిపారు. ఈ ముగింపు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిచ్‌పల్లి మండల విద్యాశాఖాధికారి ఈ.ఎల్.ఎన్. శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ టి.ఎం. విక్రాంత్‌తో కలిసి ఈ క్రీడా సమావేశాన్ని జ్యోతి ప్రజ్వళనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని, అవి వారి మనోవికాసానికి దోహదపడతాయని వివరించారు. ప్రతి క్రీడా కారుడు మనస్సుతో పాల్గొని తమలో దాగున్న నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరి మన్ననలను పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఈ మూడు రోజుల క్రీడా కార్యక్రమంలో పాఠశాల పి.ఈ.టి.లతో పాటు ఉపాధ్యాయ బృందం సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ క్రీడలు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వందేమాతరం ఉన్నత పాఠశాల చదువులతో పాటు క్రీడల్లో కూడా తమ విజయభేరినీ మోగిస్తుందని ప్రిన్సిపాల్ విక్రాంత్ పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు.

## 38వ నేషనల్ గేమ్స్‌కు డిసిడిఎంగా ఈగ సంజీవ్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖాండ్‌లో జరగనున్న నేషనల్ గేమ్స్‌కు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఈగ సంజీవ్‌రెడ్డి డిప్యూటీ చీఫ్ డి మిషన్ (డిసిడిఎం)గా నియమితులయ్యారు. తెలంగాణ నుండి ఇద్దరిని డిప్యూటీ చీఫ్ డి మిషన్‌లుగా నియమించగా జిల్లాకు చెందిన ఈగ సంజీవ్‌రెడ్డి నియమితులవడం విశేషం. జాతీయ క్రీడలకు డిప్యూటీ చీఫ్ డి మిషన్‌గా ఈగ సంజీవరెడ్డి నియమితులు కావడం పట్ల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ అంద్యాల లింగన్న, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య జిల్లా కార్యవర్గం క్రీడా సంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## మంథని గ్రామంలో ఎల్లమ్మ ఉత్సవాలు



పండుగలో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలం లోని మంథని గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మహిళలు మంగళ హారతులతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజు గౌడ్, సంఘం సభ్యులు కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## బడి బయట పిల్లలను బడుల్లో చేర్పిస్తాం



పాఠశాలలో చేర్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న బడి బయట పిల్లలని బడుల్లో చేర్పిస్తామని మండల విద్యాశాఖ అధికారి రామస్వామి తెలిపారు. శనివారం ఎండ్రియాల్, సంగోజు వాడి గ్రామాల్లో బడి బయట ఉన్న నలుగురు పిల్లలను క్షేత్రస్థాయిలో గుర్తించామని తెలిపారు. విద్యతో ఉన్న ఉపయోగాలు వారి తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను బడుల్లో చేర్పిస్తామని తెలిపారు. ఈ పర్యవేక్షణలో సిఆర్‌పిలు రాధా, నర్సింలు, రాజేందర్, తదితరులున్నారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

- ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవం
- పలు మండలాల్లో అవగాహన కార్యక్రమాలు
- మానవహారం.. ప్రతిజ్ఞ

నవతెలంగాణ-విలేకరుల బృందం

**ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు మండలాల్లో ఓటర్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించి.. ప్రతిజ్ఞ చేశారు.**

**రెంజల్ :** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో తహసిల్దార్ శ్రావణ్ కుమార్ జాతీయ ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యాలయంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్ఐ రవికుమార్, మనసుర్, గౌతమ్, శంకర్, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**బాల్కొండ :** ఓటు హక్కును ప్రతి పౌరుడు వినియోగించుకోవాలని బాల్కొండ తహశీల్దార్ అడ్ప శ్రీధర్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల అధికారులు, సిబ్బందితో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీఓ గంగామోహన్, ఎమ్మార్ఐ గంగారం, ఆర్ఐ భరత్, సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఏఈఓ నిహారిక, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పోతంగల్ :** అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గంగాధర్ అన్నారు. మండలంలో రెవిన్యూ, విద్య, గ్రామపంచాయతీల సారథ్యంలో ఓటరు నమోదు దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, గ్రామపంచాయతీ ప్రత్యేక పాలనాధికారి చందర్, పంచాయతీ సెక్రటరీ చంద్రకాంత్, ఏఎంసి చైర్మన్ హన్మంతు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, సాయిబాబా, విఠల్ తదితరులు ఓటర్ల అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ ఓటరు నమోదు, ప్రాముఖ్యతపై నినాదాలతో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బస్ స్టాండ్ వరకు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యత వివరించి, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంఇఓ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి కార్యక్రమాన్ని ముగించారు.

**బోధన్ :** జాతీయ ఓటరు దినోత్సవాన్ని సాలూర మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శశిభూషణ్ ఆధ్వర్యంలో ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వినియోగంపై తహశీల్దార్ వివరించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**మోపాల్ :** మండల కేంద్రంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని విద్యార్థుల ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామేశ్వరరావు మాట్లాడుతూ.. కచ్చితంగా 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులందరూ ఓటు వేయాలని, ఓటు అనే ఆయుధంతోనే ప్రజాస్వామ్య విలువలు కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గేమ్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ సరిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

**బాల్కొండ :** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "జాతీయ ఓటరు దినోత్సవాన్ని" పురస్కరించుకొని విద్యార్థులచే ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ వై.వేణుప్రసాద్ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించారు. 18 సంవత్సరాలు నిండిన వయోజనులందరూ ఓటు హక్కును నమోదు చేసుకొని ఓటు హక్కు వినియోగించాలని ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కేటీఎస్ ఆధ్వర్యంలో..**

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. పాఠశాల క్రీడా మైదానంలో ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల నుంచి పాత జాతీయ రహదారి గుండా శివాజీ చౌక్, పాత బస్టాండ్, ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానం, వినయక్‌నగర్ మీదుగా విద్యార్థులు ర్యాలీని కొనసాగిస్తూ పలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఏ.శ్రీధర్, మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఎంఆర్ఐ పీ.గంగారం, ఏర్ఐ డీ.భరత్, జూనియర్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్‌లు కోటగిరి భాను చంధర్, ఆకుల లక్ష్మణ్, పాఠశాల పర్యవేక్షకులు బీ.రాజేందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**ఆర్మూర్ :** జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ రాజాగౌడ్, ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గజానన్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, కమిషనర్ రాజు ప్రారంభించారు. ఈ ర్యాలీ మామిడిపల్లి చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఎంఈఓ రాజగంగారం తదితరులు పాల్గొన్నారు.

చేపూరు క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ ఓటర్స్ డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించి, ఓటు హక్కు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వచ్ఛందంగా ప్రమాణం చేసి, ప్రజాస్వామ్య వ్యవస్థను రక్షించడానికి, సమర్థమైన నాయకుల ఎంపిక కోసం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సంకల్పించారు. ఓటింగ్ ప్రాముఖ్యతను తెలియజేయడానికి క్విజ్‌లు, పోస్టర్ ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ అల్జపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ ఆర్.కె.పాండే వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, కో ఆర్డినేటర్ సుజిత్ కుమార్, ఈవెంట్ ఆర్గనైజర్ మీర చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఉన్నత పాఠశాలలో..**

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ దినోత్సవ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌరస్తా కూడలిలో ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నిష్పక్షపాతంగా, నిర్భయంగా, ఎలాంటి ఒత్తిడి లేని స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆలూరు మండల కేంద్రంలో..**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు యం.నరేందర్ అధ్యక్షత వహించి ఓటు హక్కు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఆలూర్ మండల తహసీల్దార్ రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా, మండల విద్యాశాఖాధికారి విద్యార్థులతో ప్రతిజ్ఞ (ప్రమాణం) చేయించి, ప్రజాస్వామ్య వ్యవస్థను రక్షించడానికి, సమర్థమైన నాయకుల ఎంపిక కోసం ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఫీక్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజలు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలో 63వ నంబర్ జాతీయ రహదారిపై 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తహసిల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ కూడలిలో మానవహారంతో ప్రతిజ్ఞ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది, మహిళా అభివృద్ధి సంస్థ, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పోలీస్ శాఖ, అటవీ శాఖ సిబ్బందితో కలిసి తహసిల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేవా అని ఒకటికి రెండు సార్లు ఎప్పటికప్పుడు సదరు ఓటరు తనిఖీ చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్క ఓటరు నిర్భయంగా తప్పకుండా ఓటు హక్కుని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం బూత్ లెవెల్ అధికారులకు తహసీల్దార్ ఆంజనేయులు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చింత రాజ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, రెవిన్యూ, అటవీ శాఖ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ సిటీ :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఏ.రాజిరెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ బి.తారకం, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నరేష్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్స్ రాజేశ్వర్, శ్రీకాంత్ రికార్డ్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ మధు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో..**

జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినిలచే ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య భారతదేశంలో భారతీయులకు కుల, మత, వర్ణ, వర్గ, ప్రాంత భేదాలకు అతీతంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూలో ప్రతిజ్ఞ చేయించారు.

**వ్యాసరచనలో విద్యార్థినికి మొదటి బహుమతి..**

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ అధికార యంత్రాంగం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన హెచ్.ఈ.సీ.ఇంగ్లీష్ మీడియం విద్యార్థిని షేక్ అమీనా మొదటి బహుమతి సాధించింది. శనివారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో షేక్ అమీనాకు కలెక్టర్ ప్రశంసాపత్రం, మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీ తిరుమలపుడి రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ బుద్ధిరాజ్, విద్యార్థిని కుమారి అమీనాను అభినందించారు.

**గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..**

జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్మోహన్ రెడ్డి విద్యార్థులు, సిబ్బందితో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు నాగజ్యోతి, సుధాకర్ రావు, దస్తప్ప, వెంకటరమణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

**ఏర్గట్ల ప్రభుత్వ పాఠశాలలో..**

**ఏర్గట్ల :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మార్వో శ్రీలత, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**డిచ్‌పల్లి :** డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల పరిధిలోని అయా గ్రామాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి కే.రాజేంద్ర కుమార్, తహశీల్దార్ బి.ప్రభాకర్, వెంకట్‌రావు, మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్‌లు పలుచోట్ల పాల్గొన్నారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో మానవహారం నిర్వహించి, ఓటరు ప్రతిజ్ఞ చేశారు. పలుచోట్ల వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, అయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంత కీలకం: సబ్‌కలెక్టర్**

**బోధన్ :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని దానిని ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ డివిజన్ పరిధిలో ఓటర్ నమోదు ప్రక్రియ నిరంతరంగా చేపడుతున్నామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలో ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓల పనితీరు బాగుందని ప్రశంసించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**జక్రాన్‌పల్లి :** మండల కేంద్రంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని హైస్కూల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేసినట్టు తహసీల్దార్ కిరణ్మయి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**భీంగల్ రూరల్ :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జడ్పీహెచ్ఎస్ భీంగల్ పాఠశాలలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఓటర్ల దినోత్సవం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు లింబాద్రి, జాన్ విల్సన్, రాములు, వినోద్,సాగర్, రఘువాస్, తదితరులు పాల్గొన్నారు.



డొంకేశ్వర్ మండల కేంద్రంలో ఓటరు దినోత్సవం ప్రతిజ్ఞ



పోతంగల్ : అవగాహన ర్యాలీ..



నిజామాబాద్‌సిటీ : కేంద్ర గ్రంథాలయంలో..



ఏర్గట్లలో..

## ప్రతి గ్రామం నుంచి పోటీ చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

బహుజన్ సమాజ్ పార్టీ కామారెడ్డి జిల్లా కార్యాలయంలో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథి రాష్ట్ర అధ్యక్షులు మందప్రభాకర్ హాజరై మాట్లాడారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కామారెడ్డి జిల్లా నుంచి ప్రతి గ్రామం నుంచి పోటీ చేసి గెలిచే విధంగా దశ దిశలు నాయకులకు కార్యకర్తలకు సూచించారు. బహుజన్ సమాజ్ పార్టీ అనేది మహనీయుల సిద్ధాంతాలపై నిర్మించబడిన పార్టీ అని, రాజ్యాంగాన్ని రక్షించే పార్టీ, రాజ్యాంగాన్ని పూర్తిగా అమలు చేసే ఒకే ఒక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోఆర్డినేటర్ ఈశ్వర్, రాష్ట్ర ఈసీ గైనీ గంగాధర్ నిజామాబాద్ జిల్లా, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి అడ్వకేట్ జగన్, నిర్మల్ జిల్లా కన్వీనర్ లక్ష్మి యాదవ్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మాలోత్ హరిలాల్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు కోకొండ రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల సురేష్, జిల్లా కోశాధికారి కడ మంచి సిద్ధిరాములు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ దంపతులకు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియామకమైన ధర్మగోని లక్ష్మి రాజగౌడ్ దంపతులను, వైస్ చైర్మన్ బ్రహ్మానంద రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు భూమా గౌడ్, చంద్ర గౌడ్, నాగరాజ్ గౌడ్, రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## అపోహలను వీడి రక్తదానం చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

అపోహలని వీడీ రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని కామారెడ్డి బ్లడ్ డోనర్స్ అధ్యక్షులు పరిహారం కిరణ్ యువకులకు పిలుపునిచ్చారు. కామారెడ్డి బ్లడ్ డోనర్స్ అద్వర్యంలో శనివారం రక్త నిధి కేబీఎస్లో బ్లడ్ నిల్వ లేనందువల్ల శనివారం కామారెడ్డి బ్లడ్ డోనర్స్ అధ్యక్షులు పడిహార్ కిరణ్ పిలుపు మేరకు కామారెడ్డి బ్లడ్ డోనర్స్ ఉపాధ్యక్షులు సాయి కిరణ్ బి పాజిటివ్ బ్లడ్ అందజేసినట్టు తెలిపారు.

## రైతు సమస్యలు, ఆత్మహత్యలపై అధ్యయన సమావేశం రద్దు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్‌లో రైతు సమస్యలు ఆత్మహత్యలపై అధ్యయన సమావేశం రద్దు అయింది. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నేతృత్వంలో రైతు సమస్యలు, ఆత్మహత్యలపై అధ్యయనం చేయడానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించిన కమిటీ నిజామాబాద్ జిల్లాలో పర్యటించనుంది. పర్యటనలో భాగంగా శనివారం కమిటీ సభ్యులు, ఆర్టీసీ మాజీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆహ్వానం మేరకు మండలంలోని తొర్లికొండ గ్రామంలో రైతులతో సమావేశం కావలసి ఉండగా సమావేశానికి సరిపడా కార్యకర్తలు లేనందున సమావేశం రద్దు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-మోపాల్

రైతు భరోసా పథకానికి కొత్తగా వచ్చిన పట్టాదారు పుస్తకం గల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి సౌమ్య, విస్తరణ అధికారి రంజిత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికిగాను రైతులు పాస్‌బుక్ లేదా డిజిటల్ సంతకమైన జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ సేవింగ్ ఖాతా జిరాక్స్, పూర్తిగా నింపిన దరఖాస్తు ఫారంను వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారికిగాని సమర్పించాలని సూచించారు. ఇంతకుముందు రైతు బంధు వచ్చిన వారు అవసరం లేదని, కేవలం కొత్తగా పట్టమార్పిడి చేసుకున్న వారు మాత్రమే అప్లై చేసుకోవాలని పేర్కొన్నారు.

## టీజీవిపి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ విద్యార్థి పరిషత్ 2025 నూతన క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి మరింత కృషి చేయాలని, విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా ప్రయత్నం చేయాలని తెలిపారు. సామాజిక అంశాలపైన, న్యాయపరమైన అంశాలపైన, అవగాహనా సదస్సులు ఏర్పాటుచేసి విద్యార్థులలో ఆ అంశాలపై చైతన్యం తీసుకొచ్చి వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి విద్యార్థి సంఘంగా పనిచేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సజ్జనం భానుచందర్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్, బోధన్ డివిజన్ అధ్యక్షుడు మీసలే నగేష్ ,నగర అధ్యక్షుడు అఖిల్ చారి, సుజిత్, వీరేష్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

# వరిపంటలో జాగ్రత్తలు తీసుకోవాలి

- మండల వ్యవసాయాధికారి మధుసూధన్

నవతెలంగాణ-డొంకేశ్వర్



వరి పంటలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుసూధన్ సూచించారు. ప్రస్తుతం వరి నాట్లు వేయడం పూర్తయిన నేపథ్యంలో వరి సాగుచేసిన రైతులకు ఆయన కీలక సూచనలు చేశారు.

**కాండం తొలిచే పురుగు (మొగిపురుగు/తెల్ల కంకి)..**

ఈ పురుగు ఆలస్యంగా లేదా ముదురు నారు నాటడం కరువు పరిస్థితులు, రాతి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నపుడు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంటుంది.

**లక్షణాలు..**

నారు మడిలో ఆశిస్తే మొక్కలు, పిలక దశలో ఆశిస్తే మొవ్వులు ఎండి చనిపోతాయి. అంకురం నుంచి చిరు పొట్ట దశలో ఆశిస్తే ఈనిక తర్వాత తెల్లకంకులు బయటకు వస్తాయి.

**నివారణ చర్యలు..**

ముదురునాటు నాటేటప్పుడు నారు కొనలను తుంచి నాటుకోవాలి. పిలకలు లేదా దుబ్బు చేసే దశలో కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కేజీలు లేదా, ఎసిఫేట్ 75 ఓఎస్‌పీ 1.5 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 2 గ్రా.. లీటరు నాటుకి చొప్పున పిచికారీ చేసుకోవాలి. అంకురం దశలో ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంత్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4కిలోలు లేదా క్లోరాంత్రానిప్రోల్ 18.5 ఎస్‌సీ 0.3 ఎంఎల్ లీటరు నీటిని చొప్పున పిచికారి చేసుకోవాలి.

## టీకాల విషయంలో నిర్లక్ష్యం వద్దు

నవతెలంగాణ-భిక్కనూర్ (రాజంపేట్)

చిన్నారుల టీకాల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని హెల్త్ సూపర్‌వైజర్ మంజూరు తెలిపారు. శనివారం రాజంపేట్ పట్టణ కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య సబ్‌సెంటర్‌లో ఇమిసేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లలకు సంబంధించిన టీకాలు క్రమంగా తీసుకునే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డు పరిశీలించి, టీకాల గడువు తేదీని చూసుకోవాలని వైద్య సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చందబిబి, నాగలక్ష్మి, ఆశలు, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

నిజామాబాద్ జిల్లాలో జరిగే ఎస్సీ వర్గీకరణ సన్నాక సమావేశానికి లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు శనివారం బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నెల్లూరి గంగారం,కోశాధికారి బాలయ్య ,జిల్లా నాయకులు భూపతి, లేగ్గేల.రాజు, కాశీరం, వెంకట్, బాలయ్య, రాములు, ఎల్లయ్య ప్రభురాజు పాల్గొన్నారు.

## బాలికల చదువు భవితకు వెలుగు

నవతెలంగాణ-లింగంపేట్

విద్యాశాఖలో నిర్వహిస్తున్న బడి బయటకు పిల్లల సర్వే ఇంకా కొనసాగిస్తున్నట్టు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని రాంపల్లి, ఐలాపూర్ ,రాంపల్లి తండాలో సర్వే నిర్వహణ భాగంలో ఐలాపూర్ గ్రామానికి చెందిన ఎల్లవ్వ కూతురు ప్రత్యూష నాలుగో తరగతి వరకు చదువుతూ గత మూడు నెలల నుంచి ఇంటి వద్ద తన తమ్ముడిని సంరక్షణ కోసం బడి మానేసింది. బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని, చదువుకుంటే పిల్లలకు భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చదువు ,మధ్యాహ్న భోజనం, దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, రాగి జావా అందిస్తున్నందున విద్యార్థులను ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని కౌన్సెలింగ్ ఇచ్చా రు. అనంతరం ఆ విద్యార్థిని స్థానిక ప్రాథమిక పాఠశాల ఐలాపూర్ లో తిరిగి నాలుగో తరగతిలో రీ అడ్మిషన్ చేయించినట్టు తెలిపారు.